క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అనిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతారని ఆమె తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

11న ఈజీఎస్ ప్రజావేదిక

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీపై ఈనెల 11న ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ సోమమారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, ఈజీఎస్ కూలీలు హాజరుకావాలని ఆయన కోరారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మారెడ్డి

మాడ్గుల: మాడ్గుల మండలంలోని దోడ్లపహాడ్ ఎస్సీ కాలనీలో రూ.2లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సోమవారం ఎంపీపీ పద్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడతామని తెలిపారు. దశలవారీగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రజలందరూ అభివృద్ధికి సహకరలించాలని కోరారు. గ్రామ సర్పంచ్ విజయ, నాయకులు అభినందన్ రెడ్డి, మల్లేశ్, మంజుల, కృష్ణ, డీలర్, జంగమ్మ, గంగయ్య, యాదయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

కౌన్సిలర్ సునీల్



కౌన్సిలర్ సునీల్‌ను సన్మానించిన స్థానికులు

తుర్కయంజాల్: వార్డు అభివృద్ధే ధ్యేయంగా పనులు చేపడుతున్నట్లు పురపాలక సంఘం పరిధి కమ్మగూడ కౌన్సిలర్ సునీల్ తెలిపారు. సోమవారం మధురానగర్‌లో రూ.7లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



న్యూ శోభానగర్ నూతన కార్యవర్గం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ న్యూ శోభానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా శ్రీశైలం, కోశాధికారిగా రామచంద్రయ్యగౌడ్, గౌరవ అధ్యక్షుడిగా రఘుమారెడ్డి, ముఖ్య సలహాదారులుగా రామయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రేవతి, ఆనంద్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

జెడ్పీటీసీ వెంకటేశ్



పూజలు చేస్తున్న వెంకటేశ్ తదితరులు

తలకొండపల్లి: భక్తితో ముక్తి, మోక్షం లభిస్తుందని జెడ్పీటీసీ వెంకటేశ్ అన్నారు. కల్వకుర్తి మండలం ఎంగంపల్లి గ్రామ శివారులోని పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యాక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ వెంకటేశ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిథిలమైన దేవాలయాలను పునరుద్ధరించడంతో పాటు నూతన ఆలయాలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కనులపండువగా కొనసాగిన ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భారత జాగృతి విద్యార్థి విభాగపు జిల్లా అధ్యక్షుడు గణేష్, సర్పంచ్‌లు గోపాల్‌నాయక్, హన్మనాయక్, కిషోర్, భక్తులు పాల్గొన్నారు.

పార్కింగ్ అడ్డాగా.. పాల శీతలీకరణ కేంద్రం!



పాలశీతలీకరణ కేంద్రంలో పార్కు చేసిన వాహనాలు

- పాలశీతలీకరణ కేంద్రంలో ప్రైవేట్ వాహనాల పార్కింగ్
- తదనంతరం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం
- సాయంత్రానికి తిరిగి తీసుకెళ్తున్న వాహనదారులు

కడ్తాల్: మండల కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రం ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు సెంటర్‌గా మారింది. శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై గ్రామ ప్రధాన సెంటర్ పాయింట్‌లో పాలశీతలీకరణ కేంద్రం ఉండటం, తహసీల్దార్ కార్యాలయం కూడా పాలశీతలీకరణ కేంద్రంలోని పాడి రైతుల సమావేశ మందిరంలో నిర్వహిస్తుండటంతో కొంత మంది ఇష్టానుసారంగా వాహనాలను ఇక్కడే నిలుపుతున్నారు. మండల కేంద్రానికి చెందిన వ్యక్తులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన వ్యక్తులు తమ వాహనాలను ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు కూడా..

అదే విధంగా ప్రతి నిత్యం హైదరాబాద్, ఆమనగల్లు తదితర ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారితో పాటు తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వ్యక్తులు కూడా వాహనాలను ఇక్కడే పార్కింగ్ చేసి వెళ్తుండటంతో పాలశీతలీకరణ కేంద్రం పార్కింగ్‌కు అడ్డాగా మారింది. అడిగే వారు లేకపోవడంతో ఇష్టానుసారంగా వాహనాలను పార్కు చేస్తున్నారు. పాలకేంద్రంలో సిబ్బంది తక్కువగా ఉండటంతో పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, కార్లు అడ్డదిడ్డంగా నిలుపుతుండటంతో పాల కేంద్రంలోకి వచ్చే పాలట్యాంకర్ల డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాల కేంద్రానికి ప్రధానంగా వాచ్‌మెన్ లేకపోవడం ప్రైవేట్ వ్యక్తుల వాహనాలకు అడ్డాగా మారిందని అదే విధంగా పాలకేంద్రంలో వస్తువులకు రక్షణ కరువైందని విమర్శలున్నాయి. ప్రైవేట్ వ్యక్తులు వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని, వాచ్‌మన్‌ను నియమించాలని పాల ఉత్పత్తిదారులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల్లో వసతులు కల్పిస్తాం

జెడ్పీటీసీ మర్రి నిత్యారెడ్డి

మంచాల: మంచాల మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు తవవంతు సహకారం అందిస్తామని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యనిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి ఆరుట్లలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారురు. ఆమె మాట్లాడుతూ.. ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆట వస్తువులు లేకపోవడంతో పాటు విద్యుత్ సరఫరా సరిగా లేదన్నారు. సీలింగ్ ఫ్యాన్లు, కుర్చీలు కూడా సక్రమంగా లేవన్నారు. తమవంతు సహకారం సమస్యల పరిష్కారం కోసం తప్పక కృషి చేస్తామన్నారు. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీల్లో గర్భిణులు, పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, స్థానిక నాయకులు బుగ్గరాములు, భాషా, జంగయ్యగౌడ్, నర్సింహగౌడ్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆరుట్లలో అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న నిత్యారెడ్డి

‘ఎంఎన్‌ఆర్’ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

మంచాల: సమాజ సేవే లక్ష్యంగా టీపీసీసీ సభ్యుడు మర్రి నిరంజన్‌రెడ్డి, మంచాల జెడ్పీటీసీ మర్రి నిత్యారెడ్డి ముందుకుపోతున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా మండలంలోని జాపాల, మంచాల, ఆరుట్ల, నోముల, తాళ్లపల్లిగూడ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు బాగా చదువుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



స్టడీ మెటీరియల్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, నాయకులు

2016 నుంచి సేవా కార్యక్రమాలు..

అనంతరం మర్రి నిత్య నిరంజన్‌రెడ్డి దంపతులు మాట్లాడుతూ.. 2016 సంవత్సరం నుంచి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తమ సొంత ఖర్చుతో స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ మాత్రమే గాకుండా ప్రతి పాఠశాలకు క్రీడా సామగ్రిని కూడా అందిస్తున్నామని తెలిపారు. ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈఏడాది నియోజకవర్గంలో 3వేల మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు జగన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లప్ప, ఆవుల మల్లేష్, జగన్, తిరుమలరెడ్డి, జంగయ్యగౌడ్, భాషా, బుగ్గరాములు, ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు మధుకర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శివ, ధన్‌రాజ్, శ్రవణ్‌రెడ్డి, నాని, కృష్ణ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజలందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. యాచారం మండలంలోని గునుగల్, నందివనపర్తి, మాల్, యాచారం, మంథన్‌గౌరెల్లి, సింగారం గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' అనే నినాదంతో ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఈ సందర్భంగా నందివనపర్తి గ్రామంలో ప్రధాని నరేంద్రమోడీ లైవ్‌లో ప్రసంగిస్తున్న కార్యక్రమాన్ని గ్రామస్తులతో కలిసి బీజేపీ నేతలు వీక్షించారు. ఈకార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరేందర్‌గౌడ్, ఎంపీపీ సుకన్య, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎం.అంజయ్యయాదవ్, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు ప్రతాప్‌తోపాటు రవీందర్, ఉదయశ్రీ, ఇందిరా శ్రీనివాస్, జంగయ్యగౌడ్, విజయ్‌కుమార్, నరేష్, శ్రీధర్‌గౌడ్, శాంతికుమార్, శేఖర్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మురుగు సమస్యకు పరిష్కారం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలో నెలకొన్న మురుగు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కాలనీ నుంచి మొదలైన ము రుగునీటి ప్రవాహం మధుబన్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై కూడా పారుతుండడంతో దుర్వాసనతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. ఈ విషయం సాక్షి దినపత్రికలో గత నెల 19న ‘మురుగు సమస్య పరిష్కరించండి’ అనే శీర్షికతో ప్రచురించడం జరిగింది. ఎట్టకేలకు సమస్యపై మున్సిపాలిటీ అధికారులు స్పందించి రూ.18.50 లక్షలు మంజూరు చేశారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో పైప్‌లైన్ నిర్మాణ పనులు కౌన్సిలర్ పల్లపు శంకర్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. కాలనీలోని ధనలక్ష్మి కిరాణ స్టోర్ నుంచి దిగువన ఉన్న ఎర్రకుంట వరకు 200 మీటర్ల పొడవులో వేస్తున్న ఈ పైప్‌లైన్‌తో ఇక శాశ్వత పరిష్కారం లభించనుందన్నారు. సమస్య పరిష్కారం కోసం కృషిచేసిన ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

వారంలో ఫిర్యాదుల పరిష్కారం

- మేయర్ గద్వాల విజయలక్ష్మి
- ఎల్‌బీనగర్‌లో ‘ప్రజావాణి’ పరిశీలన

ఎల్‌బీనగర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వారంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిని ఆమె పరిశీలించడంతో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గతంలో కరోనా ప్రబలడం వల్ల ప్రజావాణిని నిలిపి వేశామని చెప్పారు. తిరిగి ఈ రోజు నుంచి జీహెచ్‌ఎంసీ మొత్తం కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ నెల 22 నుంచి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కూడా ప్రజావాణి ప్రారంభిస్తామన్నారు. ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అందులో అధికంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి ఉన్నాయని, ఆ తర్వాత శానిటేషన్, కుక్కల బెడద, వీధి దీపాలు, దోమల నివారణపై ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజావాణిలో వచ్చిన సమస్యలను పరిష్కరించడంతో నిర్లక్ష్యం వహిస్తే డీసీలకు మెమోలు జారీ చేస్తానని మేయర్ హెచ్చరించారు. అనంతరం ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని డీసీలు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ కమిషనర్ పంకజ, ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ సీపీ ప్రసాద్ రావు, అధికారులు పున్ననాయక్, రజినీ ఉన్నారు.



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ విజయలక్ష్మి

సమస్యలు పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మిని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ కలిసి డివిజన్లలోని సమస్యలు వివరించారు. ప్రధానంగా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, దోమలు, విద్యుత్ వీధి దీపాలు తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. మేయర్ ఆయా సమస్యలను విని సానుకూలంగా స్పందించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు

ఆమనగల్లు: కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాధవిరెడ్డి దంపతులు సత్యనారాయణవ్రతం నిర్వహించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రవేశించారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సుస్థిర పాలన అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, శెట్టిపల్లి సర్పంచ్ సత్యం, నాయకులు కృష్ణనాయక్, అలీం, నాసర్, బాబా, ప్రసాద్, హరిలాల్, కొండల్ తదితరులు ఉన్నారు.



క్యాంపు కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి దంపతులు

కసిరెడ్డికి సన్మానం

తలకొండపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు సోమవారం కల్వకుర్తిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. మండలంలో అభివృద్ధి పనులకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీశైలం, రఘుపతి, ఉప సర్పంచ్ అజీజ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రదీపురెడ్డి, వెంకటయ్య, రాజు, మహేష్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయండి

డీటీ సంతోష్‌కు బీజేవైఎం నేతల వినతి

తలకొండపల్లి: మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానికంగా ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. నూతన ఆధార్ కార్డు తీయాలన్నా, పేరు, అడ్రస్, జన్మదినం తదితర మార్పులు, చేర్పులు చేయాలన్నా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆధార్‌లో ఏలాంటి మార్పులు చేయాలన్నా పక్క జిల్లాలైన నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లోని వెల్దండ, కల్వకుర్తి, ఊరుకొండపేట, మిడ్జిల్ తదితర గ్రామాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి తీరా అక్కడికి వెళ్తే భారీ క్యూలైన్ ఉంటుందన్నారు. దీంతో పని మానుకొని పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉందని డీటీకీ విన్నవించారు. పని కాకుంటే రెండు, మూడు రోజులు తిరుగడమే గాకుండా, పడిగాపులు కాసి నిరీక్షించవలసిన దైన్యస్థితి నెలకొందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మండల కేంద్రంలో తక్షణమే ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధు, కుమార్, శేఖర్, ఆనంద్, పరమేష్, వెంటేశ్ తదితరులు పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం ఇస్తున్న అనిల్

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మండల వ్యవసాయాధికారి అరుణకుమారి

ఆమనగల్లు: చెంచుల సంక్షేమ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి కోరారు. ఆమనగల్లు పట్టణంలోని చెంచు కాలనీలో సోమవారం చెంచు కుటుంబాలతో ఆమె సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందించడానికి వీలుగా అందరూ బ్యాంకు ఖాతాలను తెరవాలని వారికి సూచించారు. ఆధార్ కార్డు లేనివారు వెంటనే ఆధార్ కార్డును తీసుకోవాలని కోరారు. ప్రధానమంత్రి జన్‌మన్ యోజన క్రింద అమలు చేస్తున్న పథకాన్ని చెంచులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రైతులకు చేయూతనందిస్తున్న రైతుబంధు, రైతుబీమా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డులను పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శివతేజ, గిరిజన సంక్షేమాధికారి నయీముద్దీన్, స్థానిక వైద్యాధికారి పరీక్షిత్ నరేందర్, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరుణకుమారి



తలకొండపల్లి: చెన్నారంలో అక్షితల శోభాయాత్ర

ఇంటింటికి అయోధ్య అక్షితలు

తలకొండపల్లి: అయోధ్యలోని రామమందిరం ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని మండల పరిధిలోని చెన్నారంలో సర్పంచ్ స్వప్నాభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికి అక్షితల వితరణ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో అక్షింతల ఊరేగింపు నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అక్కడి నుంచి వచ్చిన అక్షితలను ప్రతి ఇంటికి పంపిణీ చేస్తున్నామని సర్పంచ్ స్వప్న తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వరలక్ష్మి, వార్డు సభ్యులు, హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో..

తుర్కయంజాల్: అయోధ్య శ్రీరామ అక్షితల వితరణ కార్యక్రమం సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లో పెద్దఎత్తున చేపట్టారు.ఆలయాల్లో పూజలు నిర్వహించి ఇంటింటికి తిరుగుతూ అక్షితలు పంపిణీ చేశారు. రాగన్నగూడలోని శ్రీ గణేష్ శ్రీరంగాపురం కాలనీలో మహిళలు అక్షితల వితరణ చేపట్టారు. భక్తిభావం కలిగిఉండాలన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో సీఎంగా రేవంత్ రెడ్డి నెలరోజుల పాలనపై ప్రజల్లో విశ్వాసం కనిపిస్తుందని ఆయన అన్నారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలందరికీ స్వేచ్ఛ లభించిందని, నియంతృత్వం పోయిందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, నాయకులు వెంకటేశ్వర్లుగౌడ్, కృష్ణనాయక్, అలీం, నాసర్, జహంగీర్, శ్రీకాంత్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్